ముసలి అవ్వలా ఉన్న ఒకప్పటి నవ వధువు!

దాసి వచ్చి అద్దం తీసేసింది వరండాలోంచి. ఇంట్లో ఎక్కడో లోపల దాచేసింది దాన్ని బోర్లా పడుకోబెట్టి!

ఆనతి శిరసావహించానంది దాసి.

పిల్లలతల్లి ముసలి అవ్వ ఆహ్లాదంగా నవ వధువులా మళ్ళీ నవ్వుకుంది. రూపాలు చూపించని మోటు గోడలు చూసి.

దాసి కూడా నవ్వింది ఆమెను చూసి, అసూయ లేకుండా.

## ఆచారి మాష్టారు

ఆచారి మాష్టారు ఆ రోజు చాలా అందంగా తయారయి బడికి వచ్చారు. చేనేత క్రొత్త ధోవతీ బిళ్లకట్టుగా బిగించి మల్లు లాల్చీ తొడుక్కుని, శివుడి మెళ్ళో సర్పంలా ఒక నల్ల అంచు కండువా మెడలో వేలాడేసుకున్నారు ఆయన నల్లని ఫాలభాగం మీది పంగనామం ఆకాశంలోని ఇంద్రధనుస్సులా మెరుస్తోంది. అది వలయాకారంగా వ్యాపించి, సగం చెక్కిన ఆయన నున్నని తల చివరి జుట్టులోకి మాయమయింది. అందంగా నడుస్తూ, ఆనందంగా నవ్వుతూ, హడావిడిగా లోపలికి వచ్చారు మాష్టారు.

అది ఒక కోవెల. ఆచారి మాష్టారు ఆ గ్రామంలోని పిల్లలకు (అయిదా రేండ్లనుంచి) అక్కడ చదువు చెబుతున్నారు. ఆ రోజు ఆయన పుట్టిన తేదీ. అది పిల్లలకి తెలుసు. ఎందుకంటే ఆ క్రితం రోజునే తన పుట్టినరోజు పండుగ గురించి పిల్లలకు ఒక ఉపన్యాసం యిచ్చేరు మాష్టారు.

ఆచారి మాష్టారు సైకిలుదిగి గుమ్మంలో అడుగు పెట్టగానే పిల్లలంతా నిశ్శబ్దంగా గబుక్కున నుంచున్నారు. అస్తమానూ అల్లరిచేసే పిల్లలు ఒక్కసారి బుద్ధిమంతులు అయిపోయినట్లు కనిపించారు. క్రితం రోజు ఉపన్యాసంలో పిల్లలకు ఆయన బోధించారు. తన పుట్టినరోజునాడు పిల్లలని కొట్టడం తనకిష్టం లేదని, అందువల్ల పిల్లలు తనకు కోపం తెప్పించే అల్లరి చెయ్యవద్దని కోరారు మాష్టారు. తన కోరిక అక్షరాలా పిల్లలు అమలుజరుపుతున్నట్లు కనిపించింది. ఆచారిగారు తన శిష్యులపై వాత్సల్యం కురిపిస్తూ, చిదానందంగా నవ్వారు.

"ఏడాదికి ఒక్క రోజైనా బుద్ధిమంతులయ్యార్రా మీరంతా! కూర్చోండి" అంటూ ఒక పెద్ద సైన్యాన్ని నడిపే నాయకుడి ఠీవితో సైగ చేశారు.

మెడలోని కండువా తీసి కుర్చీ చేతికి తగిలించారు. క్రొత్త పంచ జాగ్రత్తగా సర్దుకుని కుర్చీలో కూర్చోబోయారు పంతులుగారు.

కూర్చోబోతున్న మాస్టారు 'కుయో' మని పెద్ద అరుపు అరిచి, నేలమీద కొట్టిన బంతిలా అరగజం ఎత్తు పైకి ఎగిరారు. బాధగా అరుస్తూ, కోతిలా గంతేసిన పంతులుగార్ని చూడగానే బాంబు ప్రేలినట్లు ఒక్కసారి ఫకాలున నవ్వేశారు పిల్లలంతా.

అంతవరకూ ఆనందంగా ఉన్న పంతులుగారి ముఖం కోపంతో కందగడ్డ అయింది. సైకిలు చక్రాల్లా కంటి గ్రుడ్లు త్రిప్పుతూ, కుర్చీ అంతా గాలించారు. ఒక అర అంగుళము గుండుసూది నిటాగ్గా కుర్చీ నెరదల్లో పొగరుబోతుల నిలబడి వుంది.

అప్పటికి అర్థమయింది పంతులుగారికి, ఆ గుండుసూదే తన్ను నిర్దయగా పొడిచిందని. పైగా, ఆ గుండుసూది పిల్లలే పెట్టారనే విషయం కూడా ఆయనకు సులువుగా అర్థమయింది. ఎందుకంటే ఆయకి అటువంటి అనుభవాలు అప్పుడప్పుడు ఆ బడిలో అలవాటే!

తన పుట్టినరోజునాడే పిల్లలు యిటువంటి అల్లరి చేశారని మాస్టారికి మరీ కోపం వచ్చింది. ఉబికి వచ్చే నవ్వు ఆపుకోలేక చేతులు చాటుపెట్టుకుని పంతులుగారి బాధచూసి కులుకుతున్న పిల్లలు ముందు ఏమౌతుందో అని ఒకవిధంగా భయం కూడా పడ్డారు.

'ఎవడురా నా కుర్చీలో గుండుసూది పెట్టాడు?' సింహంలా గర్జిద్దామనుకున్న మేస్టారు కోపంవల్ల వణుకుతూ కప్పలా బెక బెకలాడారు.

మాస్టారి ఆకారం మారిపోయింది. ఆయన తల డిప్పలోని జుట్టు ముడి వీడి భుజంమీదికి జారింది. ఆయన పంగనామం చెమటతో చెరిగిపోగా, ముఖం సగం వెల్లవేసిన గోడలా ఉంది. కొండచిలువలా కోపంతో ఒళ్ళు విరుచుకొన్నారు. అది చూసి నవ్వారు పిల్లలు తాతబ్బాయి' అని అరిచారు టీచరు.

రౌడీలా, గిరజాల జుట్టు, నూనెకారేముఖంతో, మల్లుచొక్కా తొడుక్కున్న తాతబ్బాయి 'సార్!' అంటూ భయం నటిస్తూ నుంచున్నాడు.

'ఈత బెత్తా లేవిరా?'

ఎదురుగా కిటికీలోనుంచున్న ఈతబెత్తాలు అందిచ్చాడు తాతబ్బాయి మాస్టారికి.

అల్లరి చేసినప్పుడు పిల్లలను కొట్టడానికి ఈత బెత్తాలు తాతబ్బాయి చేత తెప్పించడం పంతులుకి అలవాటు. పిల్లలంటే అతనికి ఎంత ఎక్కువ అభిమానమో, వాళ్ళు అల్లరి

చేస్తే, అంత సులువుగా కోపం తెచ్చుకుని పిల్లలని కొట్టడం ఆచారి మాస్టారి స్వభావం.

'ఏమ్రా! ఈ గుండుసూది ఎవరు పెట్టారు ఈ కుర్చీలో?' ఒక ఘీంకారం చేశారు.

'నుంచోండి' అరిచారు ఆయన.

పిల్లలంతా నిశ్శబ్దంగా నుంచున్నారు. మూగజంతువుల్లా గుడ్లప్పచెప్పి ఎరుపురంగు పొందుతున్న పంతులుగారి నల్లముఖంవైపు, ఆయన చేతిలో బుసకొడుతున్న త్రాచుపాములా వాలుగా నిలుచున్న ఈతబెత్తం వైపు చూస్తూ నుంచున్నారు. రౌడీ తాతబ్బాయి ఏమీ ఎరగని వానిలా అమాయకంగా మాస్టార్వైపు చూశాడు.

పిల్లల నిశ్శబ్దంతో ఆయనలో జెర్రెలు, త్రేళ్ళు ప్రాకినట్లయింది. పైగా, మునుపటి సంగతులు కొన్ని జ్ఞాపకానికి వచ్చాయి. చిన్నప్పుడొకనాడు చిలిపిగా వెంకట్రావు స్నేహితుడితో గుండుసూది గ్రుచ్చి వేళాకోళాలాడితే అతడు కోపంతో దవడ వాచేలా కొట్టాడు మాస్టారిని. అప్పుడు దవడ నూనెలో వేపిన పూరీలా ఉబ్బి, ఆ వాపు పది రోజులు దాకా మానలేదు. మరొకసారి తన మూడో పెళ్ళాన్ని గుండు సూదితో గ్రుచ్చి సరసాలాడితే, ఆవిడ మాస్టారిమీద అసహ్యం కలిగి లేచిపోయిందని పుకారు ఉంది. ఇవి రెండూ జ్ఞాపకానికి రాగా, వళ్ళు మరిచిపోయే కోపంతో ఈతబెత్తంతో ప్రతి కుర్రాడినీ చావగొట్టాడు.

కాని తాతబ్బాయి తెచ్చిన పది ఈతబెత్తాలు ఒక్కొక్క దెబ్బకే ముక్కలుగా విరిగిపోయాయి. ఆ బెత్తాలకు గాట్లు తాతబ్బాయి పెట్టినట్టు మాస్టారికి తెలుసు!.

బెత్తాలన్నీ విరిగిపోయినందుకు, ఆయనకి మరీ కోపం వచ్చింది నిప్పు తొక్కిన కొండముచ్చులా కోపంతో గంతులేసే మాస్టారిని చూసి, ఆ పిల్లల వరుసలో చివర నుంచున్న రాముడు నవ్వు ఆపుకోలేక 'హిహిహి' అన్నాడు.

దానితో పంతులికి పూర్తిగా శివమెత్తినట్లయింది. ప్రక్కనే పడివున్న రూళ్ళకర్ర తీసుకుని రాముణ్ణి చితకపొడిచారు. రాముడికి గట్టి దెబ్బలు తగిలి 'బాబోయ్' అని అరుస్తూ క్రింద వాలిపోయాడు.

తన పుట్టినరోజునాడు యింత రభస జరగడం మంచిది కాదనుకుని, యీనాటికి చదువు చెప్పనంటూ రుసరుసలాడుతూ మాస్టారు కోవెల దాటి సైకిలు పట్టుకున్నారు. ఆయన సైకిలు సీటుకు కుట్టించుకున్న చిన్న పరుపు సిరాతో మరకలైపోయింది. ఒక చక్రంలో గాలిపోయింది. అప్పటికి పిల్లలను చావగొట్టడంవల్ల యింకేమనలేక 'హు' అనుకుని బాధతో సైకిలు ఈడ్చుకుని ఇంటికి వెళ్ళిపోయారు మాస్టారు.

అసలు గుండుసూది కుర్చీలో పెట్టినవాడు రౌడీ తాతబ్బాయి. అది పిల్లలందరికీ తెలుసు ఆ సంగతి టీచరుకి చెబితే డొక్కచీల్చేస్తానని తాతబ్బాయి అందరినీ బెదిరించాడు. అసలు పిల్లలందరికీ టీచరుకన్న తాతబ్బాయంటే చాలా హడలు! వాడు తల్చుకున్న పని చేసి తీరుతాడు. పంతులికి కూడా తాతబ్బాయి అంటే హడలే! అందుకే వాడిని ఏమనలేక తక్కిన పిల్లలనందరినీ చావగొట్టారు.

ఎంతోకోపం తెచ్చుకున్నా మాష్టారు మర్నాడు శాంతంతో పిల్లలనందరినీ ముద్దు పెట్టుకుని, బటానీలు. నిమ్మతొనలు తన స్వంత ఖర్చుతో తెప్పించి యిస్తారనే సంగతి పిల్లలకందరికీ తెలుసు. మర్నాడు టీచరు బడికి రాగానే అల్లాగే జరిగింది కూడా

'రాముడేడీ?' మాస్టారు బటానీలు పంచిపెడుతూ క్లాసంతా పరిశీలించి చూశారు

'రాముడికి జ్వరం వచ్చిందండి.' ఒక కుర్రాడు నుంచుని సమాధానమిచ్చి కూర్చున్నాడు.

మాస్టారి మనస్సు వెన్నలా కరిగిపోయింది. అదో పరధ్యానంగా పాఠాలు చెప్పి; బడి మూసి యింటికి వెళ్ళిపోయారు మాస్టారు.

వారం రోజులు రాముడు బడికి రాలేదు.

రాముడు తల్లితండ్రులు తన్ను గురించి ఏమనుకుంటారో అని బాధపడుతూనే అతని ఇంటికి వెళ్ళారు, ఒకరోజు సాయంత్రం, జ్వరం తగ్గింది రాముడికి ఆ వేళే.

మాస్టారు రావడం చూసి రాముడు మంచంమీద లేచి కూర్చున్నాడు.

రాముడు బడిలో అందిరిలోకి చాల తెలివైనాడు, బుద్ధిమంతుడు. అది మాస్టారికి తెలుసు. కాని, కోపం ఆపుకోలేక రాముడిని కొట్టారు మాస్టారు.

మాస్టారు మెల్లిగా కుర్చీలో కూర్చుంటూ, రాముడికేసి చూస్తూ 'బాబూ,కులాసాగా ఉన్నావా?' అన్నారు.

మాస్టారు యింటికి వచ్చేరనే సంతోషంతో రాముడు నవ్వాడు.

'ఈ రోజే పథ్యం పుచ్చుకున్నాడండి.' రాముడి తల్లి తలుపుచాటునుంచి మాస్టారికి విన్నవించింది.

'రేపు బడికి వస్తావా?'

'వస్తానండి.'

రాముడివైపు చిదానందంగా చూస్తూ, అరటికాయకర్రులతో అసహ్యంగా ఉన్న

చేతిలోని గుడ్డసంచి కింద బోర్లించారు మాస్టారు. ఒక డజను బత్తాయికాయలు గలగలా రాలాయి.

రాముడు ఆశ్చర్యంగా మాస్టారివైపు చూశాడు. అతని తల్లి ఆ కాయలు చూస్తూ లొట్టలు వేస్తూ నోరు ఆవలించింది.

'నీకోసమేనోయ్' ఆచారి మాస్టారు నవ్వారు. ఆయన పంగనామం ఆనందంతో చిలిపిగా చిట్లించింది.

అంతే, మాస్టారు రాముడియిల్లు విడిచి వీధిలో అడుగుపెట్టారు.

పది సంవత్సరాల క్రిందట కోపంతో తన ఐదేళ్ళ కొడుకును అల్లరి చేసినందుకు చావగొడితే గుక్కపట్టి చచ్చిపోయాడు. మళ్ళీ పిల్లలు కలగలేదు మాస్టారికి. మూడో భార్య లేచిపోయాక, ఒంటరిగానే కాలం గడుపుతున్నారు ఆయన.

హాయిగా బ్రతకడానికి డబ్బున్నా, పిల్లలమీది అభిమానంవల్లే ఒక బడిపెట్టారు మాస్టారు.

నడుస్తూంటే రాముడు ఆయన కళ్ళముందు మెదిలాడు. 'మాస్టారూ! నన్ను పెంచుకోండి' అన్నట్లు వినిపించింది. అది సాధ్యంకాదని మాస్టారు ఒక కన్నీటిబొట్టు విడిచారు.